క్లుప్తంగా

బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా రవీందర్‌రెడ్డి



యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామానికి చెందిన వన్నవాడ రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవీందర్‌రెడ్డి కొన్నేళ్లుగా ఏబీవీపీ, బీజేవైఎంలో చురుగ్గా పనిచేసి విద్యార్థి, యువత సమస్యలపై రాజీలేని పోరాటం చేశాడు. రవీందర్‌రెడ్డి సేవలను గుర్తించి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి గురువారం యాచారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని అయ్యేందుకు, భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి



తుర్కయంజాల్: ఓటు యొక్క ప్రాముఖ్యత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. సత్యనారాయణరెడ్డి, సెయింట్ పాల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డా.ఎం. కిరణ్మయి తెలిపారు. ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం తుర్కయంజాల్‌లోని సెయింట్ పాల్స్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఈఈ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ కల్యాణం



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానించిన నిర్వాహకులు

కడ్తాల్: మండల కేంద్రంలోని ఈదమ్మ దేవత ఆలయంలో శుక్రవారం ఈదమ్మ దేవత కల్యాణమహోత్సవం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేడుకలకు భక్తులతో పాటు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, చందోజీ, మల్లేశ్‌గౌడ్, జహంగీర్‌అలీ, చేగూరి వెంకటేశ్, రాంచందర్‌నాయక్, సత్యంయాదవ్, చంద్రశేఖర్, శేఖర్‌గౌడ్, మల్లయ్య, యాదయ్య, రాజేందర్, వడ్డెర సంఘం నాయకులు, భక్తులు ఉన్నారు.

ఓటు వజ్రాయుధం

డీటీ సంతోష్

తలకొండపల్లి: ఓటు అనేది వజ్రాయుధంతో సమానమని డీటీ సంతోష్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉండాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటును పారదర్శకంగా వినియోగించుకోవాలని కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఆమనగల్లు: మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ అనిత, ఎంపీడీఓ శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. నేడు 19న (శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనిత ప్రకటించారు.

22న ఉచిత వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 22న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

జలం.. పాతాళం

- ఎండుతున్న పంట పొలాలు
- అదనపు బోర్లు వేసినా చుక్కా నీరు పడని వైనం
- రైతన్న కన్నీటి పర్యంతం

మండలంలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. రోజురోజూకు తగ్గిపోతున్న నీటి మట్టాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వానాకాలంలో అంతంతమాత్రంగా వర్షాలు కురవడం, ఎండలు మండుతుండటంతో బావులు, బోర్లు వట్టిపోతున్నాయి. సాగు చేసిన పంటలు కళ్లేదుట ఎండిపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

తలకొండపల్లి: యాసంగిలో పంటలు సాగు చేసిన అన్నదాతల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారయింది. మల్బరీ తోటలకు నీరు లేక ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లకు నీరందక పంటలు ఎండుముఖం పట్టాయి. పంట పొలాలు నెర్రలు వారుతున్నాయి. కళ్లేదుట పంటలు ఎండిపోతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి అదనంగా బోర్లు వేసినా చుక్కా నీరు కూడా రావడం లేదని రైతులు ఆక్రోశిస్తున్నారు. గత నెల రోజుల క్రితం వరకు బోర్ల నుంచి సమృద్ధిగా నీరు వచ్చినా, రానురాను పూర్తిగా తగ్గిపోయి పొలం బీటలు వారుతున్నాయి. పలువురు రైతులు పంటలను మధ్యలోనే వదిలేస్తున్నారు. గత పదేళ్లలో ఇంతటి పరిస్థితి ఎప్పుడు ఎదురుకాలేదని వాపోతున్నారు. మండల పరిధిలోని కోరింతకుంట కుంట తండాల్లో సాగు చేసిన మల్బరీ తోటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటి ఆశలతో మల్బరీ తోటలను సాగు చేసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. వేసవి



కోరింతకుంటతండాలో ఎండుతున్న మల్బరీ తోటలు

ముగిసే సమయానికి పరిస్థితి మరింత దిగజారేలా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోరింతకుంట తండాలో వరికి ప్రత్యామ్నాయంగా అధిక దిగుబడి వచ్చి లాభాలు అధికంగా ఉంటాయని, 30 మంది రైతులు బోర్ల ఆధారంగా మల్బరీ (పట్టుపురుగుల)తోటలను సాగు చేశారు. గత నెల రోజులుగా బోర్లల్లో నీటి మట్టం పడిపోయింది. బోర్లు ఆపి, ఆపి పోస్తున్నాయి. నీరు అందక మల్బరీ తోటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు అదనపు బోర్లు వేసినను చుక్కా నీరు పడటం లేదని ఆందోళన చెందుతున్నారు. లక్షలు ఖర్చు చేసి ఒక్కొక్కరు రెండు, మూడు బోర్లు వేసినా కూడా నీళ్లు పడటం లేదని తల్లడిల్లుతున్నారు.

రూ. లక్షా 80 వేలు ఖర్చు చేశా..



లక్ష రూపాయాలు ఖర్చు చేసి మూడెక్కరాల్లో మల్బరీ తోటలను సాగు చేశా. నెల రోజుల నుంచి బోర్లలో నీటిమట్టం తగ్గడంతో తోటలకు నీరు అందడం లేదు. దీంతో రూ. లక్షా 80 వేలు ఖర్చు చేసి 500 ఫీట్ల వరకు మూడు బోర్లు వేయించా. అయినా ఫలితం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి

–హరిలాల్ , రైతు, కోరింతకుంట తండా

మూడు బోర్లు వేశా..



బోర్ల ఆధారంగా మల్బరీని 3 ఎకరాల్లో సాగు చేశా. ఉన్న రెండు బోర్లు ఎండిపోయి తోటలకు నీరు అందడం లేదు. రూ. 2 లక్షలు ఖర్చు చేసి మూడు బోర్లు వేశా. అయినా చుక్కా నీరు పడలేదు. కళ్ల ఎదుటే పంటలు ఎండిపోతున్నా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. బోర్లు ఆధారంగా రైతులను గుర్తించి, నీరు అందక పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వపరంగా నష్ట పరిహారం చెల్లించాలి. –చిన్నదావ్లా, రైతు, కోరింతకుండా తండా

రెండు బోర్లు ఎండిపోయాయి



నాకున్న రెండు బోర్లు ఎండిపోయి, రెండు ఎకరాల్లో సాగు చేసిన మల్బరీ తోటలకు నీరు అందడం లేదు. పంటను కాపాడుకోవాలనే తపనలో రూ.లక్షా 30 వేలు ఖర్చు చేసి రెండు బోర్లు వేసినా చుక్కా నీరు పడలేదు. పంటలను సర్వే చేయించి రైతులకు నష్టపరిహారం అందించాలి

– జంఖా,రైతు, కోరింతకుంటతండా

నష్ట పరిహారం ఇవ్వాలి



రెండు ఎకరాల్లో రూ. 80 వేలు ఖర్చు చేసి మల్బరీని సాగు చేశా.. తోటకు సరిపోను నీరు అందడం లేదు. పంటను కాపాడుకుందామని రూ. లక్షా 40 వేలు ఖర్చు చేసి రెండు బోర్లు వేసినా ప్రయోజనం లేదు. చుక్కా నీరు కూడా పడలేదు. రెండు బోర్లు వేసినందుకు, మల్బరీ సాగుకు మొత్తం కలిపి రూ. 3 లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే సాయం చేయాలి.

– దశ్రు, రైతు, కోరింతకుంటతండా

ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

యాచారం: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కార్యకర్తలకు సూచించారు. గురువారం మండల పార్టీ నాయకులతోసమావేశమయ్యారు. భువనగిరి కోటపై మరోమారు కాంగ్రెస్ జెండా ఎగరవేయాలన్నారు. గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కావునా దేశంలో కూడా అధికారంలోకి వస్తే అభివృద్ధికి అత్యధికంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో కష్టపడి మెజార్టీ సాధనకు కృషి చేయాలని కోరారు. కష్టపడే వారికి భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు సురేందర్‌రెడ్డి, రామకృష్ణ, అరవింద్‌నాయక్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి

మండల ప్రత్యేకాధికారి అడిషనల్ డీఆర్డీఓ సూర్యారావ్



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యారావ్

ఆమనగల్లు: గ్రామాల్లో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి అడిషనల్ డీఆర్డీఓ సూర్యారావ్ అధికారులకు సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మంచినీటి సరఫరా నిర్వహణపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల ప్రత్యేకాధికారి సూర్యారావ్, మిషన్ భగీరథ డీఈ, ఏఈ శరత్, ఎంపీడీఓ శ్రీకాంత్, తహసీల్దార్ లలిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో ఆయా గ్రామాల్లో ఉన్న మంచినీటి సమస్యలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, తండాల్లో నీటి సమస్యలు ఉంటే వెంటనే తెలుసుకోవాలని, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అవసరమైతే బోర్లను రిపేర్ చేసి తాగునీరు అందించాలన్నారు. ఎక్కడైనా మంచి నీటి పైప్‌లైన్లు లీకేజీ అయినా, మరమ్మతులు అవసరమైనా వెంటనే రిపేర్లు చేయించాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సమావేశానికి వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈ కృష్ణయ్య, పశువైద్యాధికారి డా.విజయ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నమ్మక ద్రోహులకు బుద్ధి చెప్పాలి

జెడ్పీటీసీ అనురాధ, దశరథ్‌నాయక్



విలేకరులతో మాట్లాడుతున్న అనురాధ, దశరథ్‌నాయక్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్‌లో పదవులు అనుభవించి వ్యక్తిగత ప్రయోజనం కోసం నమ్మక ద్రోహానికి పాల్పడిన వారికి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, కడ్తాల జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్‌లు కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులే లేరని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులను బెదిరించి మభ్యపెట్టి కాంగ్రెస్ బీజేపీల్లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో తాగునీటికి, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కడ్తాల వైస్ ఎంపీపీ ఆనంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జీఎల్‌ఎన్‌రెడ్డి, వెల్దండ మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ కన్వీనర్ పత్యానాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళన సభకు తరలిన బీజేపీ నేతలు



సభకు తరలివెళ్తున్న నేతలు

మాడ్గుల: మండలం నుంచి బీజేపీ కమిటీల అధ్యక్షుడు, బీజేపీ ముఖ్యనాయకులు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బూత్ కమిటీ సమావేశానికి తరలివెళ్లారు. నాగర్‌కర్నూల్‌లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ బూత్ కమిటీ సమ్మేళనం నిర్వహించా రు. ఈ సమ్మేళనానికి మాడ్గుల మండలం నుంచి బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షుడు మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ తరలివెళ్లారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ బూత్ కమిటీల సమ్మేళనానికి ఆమనగల్లు మండలం నుంచి బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సమావేశానికి ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, జిల్లా బీజేవైఎం కార్యదర్శి ప్రభాకర్, నాయకులు శ్రీను, వెంకటేశ్, శ్రీశైలం, బాబు, వెంకటయ్య, మల్లేశ్, అంజయ్య, శ్రీకాంత్, సాయితేజ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి



కళావతి మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మరణించింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్‌లోని వ్యవసాయ క్షేత్రంలో గడ్డం కళావతి (76) ఒంటరిగా ఉంటోంది. ఈమె ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు నగరంలో ఉంటారు. ప్రతీవారం వచ్చి తల్లిని చూసి వెళ్తుంటారు. బుధవారం సాయంత్రం వరకూ బాగానే ఉన్న ఆమె గురువారం సాయంత్రం బంధువు వచ్చేసరికి విగతజీవిగా పడి ఉంది. నోట్లో నుంచి రక్తం రావడం, శరీరంపై రక్తపు మరకలు ఉండటంతో కళావతి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఏసీపీ కేపీవీ రాజు, క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆనవాళ్లు, ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ధనరాశి గుట్టకు జీయర్‌స్వామి రాక

కడ్తాల్: మండలంలోని బాలాజీనగర్ రాధాకృష్ణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ ఆహోబిల జీయర్ స్వామి ఆలయానికి రానున్నట్లు, ఆలయ ధర్మకర్త రామవత్ బీచ్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీయర్‌స్వామి రానుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, రుక్మిణి మాధవుల కల్యాణ వేడుక కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

నూతన సీసీ రోడ్ల పరిశీలన



సీసీ రోడ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

తలకొండపల్లి: నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను తనిఖీ చేశారు. ఎస్ఎస్ఏటీ అధికారి ఎస్‌ఆర్‌పీ వెంకన్న, పీఆర్ఏఈ విద్యాసాగర్‌తో కలిసి సామాజిక తనిఖీ నిర్వహించారు. గురువారం మండలంలోని జూలపల్లి, చెన్నారం, పూల్‌సింగ్ తండా, రాంపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో పర్యటించి సీసీ రోడ్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా ఇసుక, సిమెంట్, కాంక్రీట్లను సమానంగా వేశారా లేదాని పరిశీలించారు. పొడువు, వెడల్పు, మందం టేపుతో కొలతలు వేసి చెక్ చేశారు. నాణ్యత ప్రమాణాలు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



కార్యక్రమంలో చిన్నారులు, సరళాదేవి

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులు, వారి తల్లులతో సమావేశం నిర్వహించారు. చిన్నారులతో కథలు, పాటలు, శాస్త్రీయ పరిజ్ఞానం, సంభాషణ తదితర కార్యక్రమాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో చేయించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి మాట్లాడుతూ.. ప్రీస్కూల్ పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేరడానికి సిద్ధంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రణాళిక ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పిల్లల స్థితి, సంవత్సరంలో మూడుసార్లు అభివృద్ధి సూచికలు, శారీరక మానసిక వ్యక్తిగత భావోద్వేగ మేధావికాసం, బడికి సంసిద్ధత అంచనా వేయడం జరుగుతుందని వివరించారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రాలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నీలవేణి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ



శ్రీరంగాపురంకాలనీలో పర్యటిస్తున్న అనురాధ, సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని శ్రీరంగాపురం కాలనీ, కమ్మగూడలోని శ్రీశ్రీనివాస్ కాలనీ మధ్య నెలకొన్న గేటు వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ ఇరుకాలనీల వారికి సూచించారు. బుధవారం ఆమె మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డితో కలిసి కాలనీలో పర్యటించారు. శ్రీశ్రీనివాస్ కాలనీలో గేటుకు తాళం వేయడంతో శ్రీరంగాపురం కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఆమె దగ్గరుండి గేటు తాళం తీయించారు. అలాగే, పార్కుస్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూర్ణహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి రామాలయంలో కొలువైయున్న కోదండ రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. గత మూడు రోజులుగా శ్రీరామనవమిని పురస్కరించుకుని స్వామివారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. చివరి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, పుష్కరస్నానం, పూర్ణహుతి, పల్లకీసేవ, తీర్థప్రసాదం వినియోగంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ అర్చకులు భానుప్రకాశ్ శర్మ, నాగేంద్రశర్మ, అమూల్యపతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ఫౌండర్‌ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్‌జ్యోతి, రామవత్ భాస్కర్‌నాయక్ ,అరుణ్‌కుమార్, యాదగిరిస్వామి, చంద్రయ్య, బొడ్యానాయక్, దేవేందర్, కృష్ణ, శ్రీనివాస్, శ్రీను, శ్రీరాములు, రమాదేవి, కృష్ణగౌడ్, వెంకటేశ్, విజయ్, రాములు, శ్రీరాములు, రామకృష్ణ ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కవాడిపల్లిలోని సీతారాముల కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్ : శ్రీరామనవమిని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలోని కోదండ రామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించే రాములోరి శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. భద్రాద్రి తరహాలో నిర్వహించే కల్యాణోత్సవంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో పాటు జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాములకు తలంబ్రాలు సమర్పించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించే పట్టువస్త్రాలను డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, వైస్ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



కొలువైన సీతారామచంద్రస్వామి

కడ్తాల్: మండల కేంద్రంలోని సీతారామాలయంలోని గణపతి, సరస్వతీ, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 శనివారం ప్రారంభమై 22వ తేదీ సోమవారం వరకు, మూడు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలను శ్రీశైలం శ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి శిష్య బృందంతో పాటు, అంగడి మఠం భువనేశ్వర్‌స్వామి, జ్ఞానేశ్వర శాస్త్రి, హరీశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు, సరస్వతి సీతారామ దేవాలయ నిర్వాహకులు బస్వారాజ్ పేర్కొన్నారు.

ఉత్సవాల్లో కార్యక్రమాలు..

20న శనివారం నిత్యార్చనలు, అభిషేకములు, గోపూజ, ఆలయ ప్రవేశం, మహాగణపతి విశ్వక్సేన ఆరాధన, గౌరిపూజ, పుణ్యాహవాచనం, నాందీ, పంచగావ్య ప్రాశన, ఋత్విగ్వరణం రక్షబంధనం, అఖండ దీపారాధన, మహామంగళ హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ.

21న నిత్య అర్చనలు, ధ్వజారోహణం, మంటప దేవాస్థాపనలు, హోమం, కుంకుమార్చన, అభిషేకం

22న ఉ.11.35 నిమిషాలకు ' సీతారామస్వామి కల్యాణం, అనంతరం మహాబలిహార ణ, కుంభాభిషేకం, పూర్ణాహుతితో వార్షిక ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.